క్లుప్తంగా

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

బొమ్మలసత్రం: నంద్యాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 24 మద్యం దుకాణాలున్నాయని, వాటిని పొందేందుకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సీఐ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ, రూరల్, బండిఆత్మకూరు, గడివేముల, మహానంది, పాణ్యం మండలాల్లో మొత్తం 24 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారం దరఖాస్తుదారులకు అందజేసేందుకు స్టేషన వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లైసెన్స్ ఫీజు ఒక ఏడాదికి నంద్యాల మున్సిపాలిటీకి రూ. 65 లక్షలు , రూరల్ 65 లక్షలు, గడివేముల, బండిఆత్మకూరు , మహానంది మండలాలకు సంబంధించి రూ. 55 లక్షలు, పాణ్యం మండలానికి సంబంధించి రూ. 65 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. దరఖాస్తుకు ఈనెల 9వ తేది ఆఖరు అన్నారు. 21 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు, నేరపూరిత కేసులో 10 ఏళ్లు శిక్ష పడ్డవారు దరఖాస్తుకు అనర్హులన్నారు.

పీఆర్‌ఏఈగా కమాల్ సాహెబ్

రుద్రవరం:రుద్రవరం మండల పీఆర్ ఏఈగా కమాల్ సాహెబ్ గురువారం బాధ్యతలు చేట్టారు.గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటరాముడు బదిలీ కావడంతో ఉన్నతాధికారులు ఆయన స్థానంలో ఆళ్లగడ్డలో విధులు నిర్వహిస్తున్న కమాల్ సాహెబ్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

సచివాలయాల ఉద్యోగులు బదిలీ

శిరివెళ్ల: మండలంలోని పలు గ్రామ సచివాలయాల సిబ్బంది గురువారం బదిలీ అయ్యారు. స్థానిక 2వ గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సునీల్‌కుమార్‌రెడ్డి రుద్రవరం మండలం చిన్న కంబలూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో చిన్న కంబలూరుకు చెందిన వెంకటేష్ నియమితులయ్యారు. గోవిందపల్లె 2వ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మునికుమార్, చెన్నూరు డిజిటల్ అసిస్టెంట్ మనోజ్‌రాం గాజులపల్లెకు , యర్రగుంట్ల 2వ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సుధీర్ రుద్రవరం మండలం నరస్పాపురం, యర్రగుంట్ల 1 సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ చంద్రావతి సంజామల, వీరారెడ్డి పల్లె పంచాయతీ కార్యదర్శి చాగలమర్రి , యర్రగుంట్ల 2వ సచివాలయ కార్యదర్శి ఉమా మహేశ్వరి వెంకటాపురానికి బదిలీ అయ్యారు.

డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ


ప్రసాద్‌బాబు

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రసాద్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అనురాధ ఇటీవల జరిగిన బదిలీల్లో పాణ్యం మండలానికి బదిలీ అయ్యారు. అవుకు రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌బాబు ఉయ్యాలవాడకు వచ్చారు.

ఏఈకి ఘన సన్మానం

రుద్రవరం:రుద్రవరం మండల పీఆర్‌ఏఈగా విధులు నిర్వహించిన వెంకటరాముడు ప్రస్తుతం బండి ఆత్మకూరు మండలానికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మతో పాటు మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గురువారం ఆయనను శాలువా పూలమాలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

రెవెన్యూ కార్యాలయ ఆర్‌ఐగా ప్రసాద్

నంద్యాల(అర్బన్): స్థానిక తహసీల్దార్ కార్యాలయ పట్టణ ఆర్‌ఐగా ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయ ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ బదిలీపై నంద్యాలకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న యుగంధర్‌రెడ్డి శ్రీశైలానికి బదిలీ అయ్యారు.

ఈనెల 6న డోన్ మీదుగా స్పెషల్ రైలు

డోన్ రూరల్: ఈనెల 6వ తేదీ సికింద్రాబాద్ నుంచి కర్నూలు సిటీ, డోన్ మీదుగా వాస్కోడిగామాకు స్పెషల్ రైలు(07039) నడుస్తుందని డోన్ రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11:45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి సాయంత్రం 4:50 గంటలకు డోన్ చేరుకుంటుందన్నారు. అలాగే ఈనెల 9వ తేదీ నుంచి వారంలో రెండుసార్లు సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామాకు, వాస్కోడిగామా నుంచి సికింద్రాబాద్‌కు రైలు నడుస్తుందని పేర్కొన్నారు.

రూ.3.42 లక్షల ఆదాయం

బనగానపల్లె: నందవరంలోని చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్ నిర్వహణకు గురువారం వేలం పాట నిర్వహించారు. ఆలయపర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో పి.ఆంజనేయులు రూ.3.42 లక్షలకు దక్కించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.


ఆళ్లగడ్డలో ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత


దొర్నిపాడులో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు


ఎల్లావత్తులలో బాల త్రిపురసుందరి దేవిగా..


ఉయ్యాలవాడ మండలం ఇంజేడులో అమ్మవారు

జగన్మాతా.. నమోస్తుతే!

- ఘనంగా ప్రారంభమైన దేవీశరన్నవరాత్రోత్సవాలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవార్లు

ఆళ్లగడ్డ: విజయదశమిని పురస్కరించుకుని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గురువారం అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. హోమాలు, అభిషేకాలు, లలితా సహస్ర నామ పారాయణం, బుర్రకథ, హరికథ, కోలాటాలు, అన్నమాచార్య సంకీర్తనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది

ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ముందుగా గోపూజ నిర్వహించి అనంతరం గంగాజలాన్ని తీసుకువచ్చి వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య కలశ స్థాపన, స్వస్తి పుణ్యాహవచనం చేశారు. అనంతరం గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. రాత్రి శ్రీ వాసవీ మాతను శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంతో పాటు ఎల్లావత్తులలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గురువారం రుద్రవరంలో అమ్మవారిని పార్వతీ దేవిగా, ఎల్లావత్తులలో బాలా త్రిపురాసుందరిదేవిగా నిర్వాహకులు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

ఉయ్యాలవాడ : మండలంలో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి దేవి బాల త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం శరన్నవరాత్రులు ప్రారంభం కావడంతో తొలిరోజు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అర్చకులు అనంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

దొర్నిపాడు: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా తొలిరోజు అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అంజనీ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో కన్యకాపరమేశ్వరీ దేవిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. అమ్మవారిని పల్లకీపై ఆలయంలో ఊరేగించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులు వెంకటరమణ గుప్తా, చెంచు సుబ్బారావు గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార లక్ష్మణబాబు, ఆర్యవైశ్య సభ పాలకవర్గ ఉపాధ్యక్షులు మల్లికార్జున, సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చాగలమర్రిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో పారాయణం చేస్తున్న భక్తులు

రాజరాజేశ్వరిదేవిగా కన్యాకపరమేశ్వరి

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వెలసిన కన్యకాపరమేశ్వరీ దేవి గురువారం రాత్రి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పల్లకీపై ఊరేగించి పూజలు నిర్వహించారు. వేదపండితులు జనార్ధన శర్మ, ఓరుగంటి కిషోర్ శర్మ బృందంతో కలిసి ఆలయ అర్చకులు బనగాణపల్లె రవికుమార్ ఉదయం ప్రాత:కాల పూజలు నిర్వహించారు. ఉభయదారులుగా ముడియం గోపాలకృష్ణ, వరలక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముడియం నరసింహారావు, కోశాధికారి మధవ నరసింహయ్య, ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఎం.సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలకృష్ణ ఉప కార్యదర్శి వెంకట రమేష్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

నంద్యాల(న్యూటౌన్): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, సీనియర్ నాయకులు సుబ్బరాయుడు, శేఖర్, సోమన్న, సీపీఎం ఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు శంకర్ దీక్షను ప్రారంభించి మాట్లాడారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీరు సరికాదన్నారు. ఎన్నికల ముందు విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయమని చెప్పి ఎన్నికలు అయిపోయిన తర్వాత ఆ దిశగా ప్రయత్నాలు వేగవంతం చేశారని మండిపడ్డారు. పరిశ్రమలో పనిచేసే 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను రాత్రికి రాత్రికి ఇంటికి పంపించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సురేష్, వీరన్న, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీక్ష చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు


ఎంపీడీఓ సావిత్రి

దొర్నిపాడు: మండల ఎంపీడీఓగా గురువారం సావిత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈమె తుగ్గలి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్నాళ్లుగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసులు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఈఓపీఆర్డీ కూడా అవుకు మండలానికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఎంఈఓగా మనోహర్‌రెడ్డి



మండల విద్యాశాఖ అధికారిగా మనోహర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రం నంద్యాలలో సర్వశిక్ష అభియాన్ ఎంఐఎస్ ప్లానింగ్ కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం గురువారం ఆయన ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు గోస్పాడు మండల ఎంఈఓ అబ్దుల్ కరీం ఇక్కడ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించారు.

వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు


టి.రామకృష్ణ

చాగలమర్రి: అటవీ ప్రాంతంలో ఎవరైనా వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని డి.వనిపెంట సెక్షన్ అధికారి టి.రామకృష్ణ హెచ్చరించారు. వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని డి.వనిపెంట అటవీ సెక్షన్ పరిధిలోని చెంచుగూడెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణుల నివాసాలను సంరక్షించి వాటి జీవ వైవిధ్యమును పరిరక్షించాలన్నారు. వన్య ప్రాణులు గ్రామాల్లోకి వస్తే వాటికి హాని తలపెట్టకుండా వెంటనే విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే రైతులు తమ పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు, ఉచ్చులు ఏర్పాటు చేయరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక బీట్ ఆఫీసర్లు శ్రీమదన్ గోపాల్, శ్రీజంగం సుభాష్ , బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ నరసింహ, చెంచుగూడెం వాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డి.వనిపెంట సెక్షన్ అధికారిగా రామకృష్ణ

మండలంలోని డి.వనిపెంట అటవీ శాఖ సెక్షన్ అధికారిగా టి.రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ సెక్షన్ అధికారిగా విధులు నిర్వహించిన శ్రీనివాసులు వైఎస్సార్ జిల్లా ముద్దనూరు రెంజ్ డీఆర్‌ఓగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. కాగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన టి. రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో అటవీ సంపద సంరక్షణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

వన్య ప్రాణుల సంరక్షణకు సహకరించాలి

రుద్రవరం: వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని అటవీ అధికారు లు ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని తువ్వపల్లెలో గురువారం వన్య ప్రాణుల సంరక్షణ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టర్లు రాణెమ్మ, ఖాన్ మాట్లాడుతూ వన్య ప్రాణులను వేటాడటం, వలలు, ఉచ్చులు వంటివి వేసి ప్రాణహాని తలపెట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు నేర ప్రవృత్తిని వీడి వన్య ప్రాణుల సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ సురేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

నంద్యాల(అర్బన్): చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణానికి చెందిన ఆస్పియ అంజుమ్ అనే ఏడేళ్ల చిన్నారి హత్యకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ముస్లిం ఫెడరేషన్ నాయకులు సుహేల్‌రాణా డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మెనారిటీ ఫోరం నాయకులు మహబూబ్ బాషా, ముస్లిం ఐక్యవేదిక నాయకులు పుణజుబేర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో జరిగిన సంఘటన మరువక ముందే చిత్తూరు జిల్లాలో ఆస్పియ అంజుమ్ హత్య జరగడం దారుణమన్నారు. వరుస సంఘటనలు జరుగుతున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. మత రాజకీయాలు వదలి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి బాధిత కుంటుంబాలను పరామర్శించి ఆదుకోవాలన్నారు. లేకపోతే బాధితుల తరపున తాము పోరాటాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.


మాట్లాడుతున్న సుహేల్‌రాణా

సమగ్ర విచారణ జరపాలి

నంద్యాల (న్యూటౌన్): పుంగనూరు పట్టణంలో చిన్నారి మరణంపై సమగ్ర విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు రియాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో హోంశాఖ మంత్రి మహిళగా ఉన్నప్పటికీ రోజురోజుకు మహిళలపై హత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయన్నారు.

స్పోర్ట్స్

క్రీడా దుస్తుల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): 9వ ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టుకు ఐచర్ కంపెనీ దుస్తులు అందజేసింది. గురువారం గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి వాటిని క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈనెల 5, 6, 7 తేదీల్లో విశాఖ జిల్లాలో జరిగే రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాబు తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు మనీషా కిరణ్, ప్రజిత జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆ స్కూల్ హెచ్‌ఎం కోటయ్య విద్యార్థులను గురువారం ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. గత నెలలో స్థానిక క్రీడా మైదానంలో బేస్‌బాల్‌పోటీలకు ఎంపికలు జరిగాయన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు ఎంపిక అయ్యారని, వారు ఈ నెల 3వ తేదీ నుంచి పంజాబ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

క్రైం కార్నర్

యువతి అదృశ్యం


వడ్డె మంజుల సుప్రియ (ఫైల్)

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వడ్డె మంజుల శ్రీనివాసులు, లక్ష్మీదేవి దంపతులకు ముగ్గరు సంతానం. సెప్టెంబర్ 27వ తేదీ ఉదయం శ్రీనువాసులు దంపతులు కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి పెద్ద కుమార్తె వడ్డె మంజుల సుప్రియ కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులను ఆశ్రయించారని.. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడింది. గురువారం జరిగిన ఈ ఘటనలో ప్రకాశం జిల్లా కంభం గ్రామానికి చెందిన షేక్ అలీబాషాకు గాయాలయ్యాయి. ఈ యువకుడు పని మీద నంద్యాలకు వచ్చి తిరిగి వెళ్తుండగా మలుపు వద్ద బైక్ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన అలీ బాషాను స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భర్తపై ఫిర్యాదు

మహానంది: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని గురువారం ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. మహానంది మండలం సీతారామపురం గ్రామానికి చెందిన దేవరశెట్టి సుబ్బరత్నమ్మకు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన రంగనాయకులుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల అదనపు కట్నం కింద మరో రూ. పదిలక్షలు కావాలని భర్తతో పాటు అత్త, మామ, బంధువులైన రంగస్వామి, భాగ్యలక్ష్మి, రంగలక్ష్మి, జగన్మోహన్‌రావు ఆమెను వేధిస్తున్నారు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- హౌసింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం

నంద్యాల(అర్బన్): ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి హౌసింగ్ ఏఈ, డీఈలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈ శ్రీహరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పని దినాలను అనుసంధానం చేసి వచ్చే వారానికి గృహ నిర్మాణాల్లో పురోగతి తీసుకరావాలన్నారు. వచ్చే వారానికి 125 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆళ్లగడ్డలో 16, సంజామల 10, రుద్రవరం 10, అవుకు 10, శిరివెళ్ల 5, బండి ఆత్మకూరు 6, ప్యాపిలి 5, కొలిమిగుండ్ల 5, బేతంచర్ల 6, నందికొట్కూరు 6, దొర్నిపాడు 5, గడివేముల 5, ఉయ్యాలవాడ 5, చాగలమర్రి 5 తదితర మండలాల్లో డీఈలు పూర్తి చేస్తామన్న ఇళ్ల నిర్మాణాలపైనే సమీక్షిస్తానన్నారు. రుద్రవరం, పాములపాడు, గడివేముల, ప్యాపిలి తదితర మండలాల్లో 30 శాతం కన్న తక్కువగా పురోగతి ఉందని ఏఈ, డీఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలపై ఎంపీడీఓలు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పునాది స్థాయిలో 50 ఉపాధి హామీ పని దినాలు, రూఫ్ స్థాయిలో 40 పని దినాలు కల్పిస్తే వేతన రేటు కూడా పెరుగుతుందన్నారు. పూర్తి అయిన ఇళ్లకు 68 శాతం మేరకే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయని మిగిలిన వాటికి కూడా వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు.

ట్రైకోడెర్మావిరిడితో ఎండు తెగుల నివారణ

నంద్యాల(అర్బన్): 100 కేజీల పశువుల ఎరువుకి 2 కేజీల ట్రైకోడెర్మావిరిడిని కలిపి బెల్లం నీళ్లు చిలకరించి వారం రోజుల పాటు మగ్గపెట్టిన తరువాత పొలంలో చల్లితే వరి, మొక్కజొన్న పంటలను ఆశించిన ఎండుతెగులును నివారించుకోవచ్చని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాల్లో ఏఓ ప్రసాద రావు ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు పొటాష్ ఎరువులు వాడటం ద్వార పంటల్లో రోగ నిరోధక శక్తి పెరిగి తెగుళ్లు, పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. మూడేళ్లకు ఒక సారి భూముల్లో మట్టి పరీక్షలు చేయించుకొని మట్టి ఆధారిత ఎరువులు వాడాలన్నారు. సమావేశాల్లో ఏఈఓ ముక్తార్‌బాషా, వీఏఏలు, షర్మిల, అనిల్‌కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.


అయ్యలూరులో భూసార పరీక్ష ఫలితాల కార్డులు రైతులకు అందజేస్తున్న ఏడీఏ రాజశేఖర్

చాగలమర్రి: మండలంలోని పెద్ద వంగలి, చిన్న వంగలి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రంగనేతాజీ మాట్లాడుతూ రైతులు పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పశువైద్యులు దీపాకుమారి, వీహెచ్‌ఏ, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

గోస్పాడు: వరి పంట సాగులో సరైన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పైరు సాగు చేసే ముందు రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు ఆరోగ్యకర నారుతో నాటు వేసుకోవాలని తెలిపారు. వరిపైరులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని తెలిపారు. భాస్వరపు ఎరువులను దుక్కిలో మాత్రమే వేసుకోవాలని, పై పాటుగా వేయరాదని సూచించారు. పైరు పెరుగుతున్న సమయంలో ఎరువు, పురుగు మందులను అధిక మోతాదులో వాడరాదని సూచించారు. మోతాదుకు మించిన మందుల వాడకంతో పైర్లు నష్టపోవడంతో పాటు పంట పొలాలు కూడా భూసారం కోల్పోతాయన్నారు.


వరి పైరుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతరం గ్రామ శివారులోని వరిపైరులను పరిశీలించారు. పైరులో వచ్చే తెగుళ్లు, వాటిని ఆశించే చీడపీడలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఏ ఆర్‌ఎస్ శాస్త్రవేత్త పులిబాయి, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి!

- ఆసుపత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

బొమ్మలసత్రం: బాలింత మృతికి ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం రాత్రి ఎమ్ఎస్ఆర్ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన సలిమున్నీసా (22) 20 రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పయింది. అయితే, కడుపులో ఇన్‌ఫెక్షన్ సోకటంతో వైద్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులు చికిత్స పొందిన తర్వాత తిరిగి నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న ఎమ్ఎస్ఆర్ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ 13 రోజుల పాటు చికిత్స అందించినప్పటికీ ఇన్‌ఫెక్షన్ తగ్గకపోగా శరీరమంతా వ్యాపించటంతో గురువారం మృతిచెందింది. అప్పటికే, మందుల కోసం రూ. 2 లక్షలకు పైగా బంధువులు ఖర్చుచేశారు. ఆసుపత్రిలో రూ. 50 వేలు అడ్వాన్స్‌గా చెల్లించగా ఇంకా రూ . 2.70 లక్షలు చెల్లించి మృతదేహాన్ని తీసుకపోవాలని వైద్యులు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వైద్యమందించి బాలింత ప్రాణాలు తీయడమే కాకా తిరిగి డబ్బులు చెల్లించి మృతదేహాన్ని తీసుకుపొమ్మంటారా అంటు మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. చివరకు పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో మృతురాలి బంధువులు శాంతించి ఆందోళన విరమించారు.


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు